సాక్షి తిరుపతి

బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



ద్విచక్ర వాహనాల బహూకరణ

తిరుమల శ్రీవారికి రెండు ద్విచక్ర వాహనా లను బహూకరించారు. ఈ మేరక తాళాలను టీటీడీ అదనపు ఈఓకు అందజేశారు. - 8లో



సమస్య పరిష్కరించే వరకు సమ్మె

స్టైఫండ్ పెంచే వరకు ఎవరు ఏం చెప్పినా సమ్మె విరమించే ప్రసక్తే లేదని వెటర్నరీ జూడాలు తేల్చిచెప్పారు. - 8లో



రైల్వే గ్యాంగ్ మన్ మృతి

రైల్వే ట్రాక్‌పై పనిచేస్తున్న సమయంలో అకస్మాత్తుగా ట్రైన్ రావడంతో ఓ గ్యాంగ్ మన్ మృతిచెందాడు. మరొకరు గాయపడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు త్రిశూల స్నానం



సద్యోముక్తి క్షేత్రంలో త్రిశూలస్నాన ఏర్పాట్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలకు ముందు మాఘపౌర్ణమిన త్రిశూన స్నానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో మహాశివరాత్రి ఉత్సవాలకు నాందిగా భక్తులు భావిస్తారు. ఈ మేరకు స్వర్ణముఖి నదిలో సద్యోముక్తి క్షేత్రంలో త్రిశూల స్నానం కోసం తొట్టెను ఏర్పాటు చేశారు. అదే సమయంలో భక్తులు స్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు వంటివి కూడా వేశారు. బుధవారం ఉదయం 9 గంటలకు పంచమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఆలయం నుంచి వేంచేపుగా స్వర్ణముఖి నదిలోని సద్యోముక్తి ప్రదేశానికి తీసుకురానున్నారు. సద్యోముక్తి పురాణ ప్రవచనం అనంతరం త్రిశూల స్నాన ఘటాన్ని సద్యోముక్తి ప్రదేశంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

ఎస్సీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కోట: బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకులాల్లో 2025–26 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కోట ఎస్సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మార్చి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం ఆయా గురుకుల పాఠశాలల్లో సంప్రదించాలని సూచించారు.

పుష్పయాగానికి అంకురార్పణ



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహాస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి మంగళవారం రాత్రి వేదపండితులు పుష్పయాగానికి అంకురార్పణ కార్యక్రమాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి మాట్లాడుతూ మాఘ పౌర్ణమి నాడు స్వామివారికి పుష్పయాగం చేయడం దేవస్థాన ఆచారమన్నారు. అనంతరం అనుజ్ఞ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మత్స్యంగ్రహణం, అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రాక్టికల్స్‌కు 120 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : సీనియర్ ఇంటర్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు మంగళవారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లలో నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు 120మంది గైర్హాజరయ్యారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 94 పరీక్ష కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 4,861మంది హాజరుకావాల్సి ఉండగా వారిలో 81 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 94 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు 4,319 మందికి గాను 39 మంది గైర్హాజరైనట్టు ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

పవిత్ర స్వర్ణముఖీ నది శోకిస్తోంది. అధికార మాఫియా ముసుగులో రాత్రింబవళ్లు ఇసుక తవ్వి తరలిస్తున్నా ప్రశ్నించే గొంతుక కరువైంది. అడ్డు చెప్పే అధికారి కానరాని పరిస్థితి నెలకొంది. అక్రమ వ్యాపారం రంకెలేస్తూ పరుగులు పెడుతోంది. పచ్చ మూకల ధనదాహానికి అంతేలేకుండా పోయింది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని స్వర్ణముఖి నదిలో ఇసుకతోడేళ్లు రాత్రింబవళ్లు స్వర్ణమ్మను చెరబడుతున్నా యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడనంటోంది.

రేణిగుంట మండలం, జీపాళెం సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాలు



అమ్మో..ఇసుక తోడేళ్లు!

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు

- రెచ్చిపోతున్న ఎమ్మెల్యే అనుచరులు
- సహజవనరులను కొల్లగొట్టి.. నోట్ల కట్టలు వెనకేస్తున్న నేతలు
- స్వర్ణమ్మ శోకిస్తున్నా కన్నెత్తి చూడని అధికారులు



ఇసుక తవ్వేయడంతో ఏర్పడ్డ గుంతలు

రేణిగుంట: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇసుక తోడేళ్లు రెచ్చిపోతున్నాయి. అధికార ముసుగులో చెలరేగిపోతున్నాయి. ఎక్కడ ఇసుక కనిపిస్తే అక్కడ వాలిపోతున్నాయి. రాత్రింబవళ్లూ లేకుండా తవ్వేస్తున్నాయి. వేల కొద్దీ ట్రక్కుల ఇసుక అక్రమంగా తవ్వి ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నాయి. స్థానిక ఎమ్మెల్యే అనుచరులే ఈ తతంగం నడిపిస్తుండడంతో అధికారులెవ్వరూ అటువైపు కనెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నియోజకవర్గమంతటా ఇదే పరిస్థితి

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రధానంగా స్వర్ణముఖి నది ప్రవహిస్తోంది. ఈ నది మీదే వందలాది గ్రామాల ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. తాగు, సాగునీరు అందిస్తున్న స్వర్ణమ్మను కూటమి నాయకులు చెరబడుతున్నారు. రేణిగుంట మండలం కొత్రమంగళం, గాజులమండ్యం, తూకివాకం, పిల్లపాళెం, జీపాళెంలో ఇష్టారాజ్యంగా ఇసుక తోడేస్తున్నారు. అలాగే ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేట, ఎండీ పుత్తూరు, కొత్తవీరాపురం, శ్రీకాళహస్తి మండలంలోని రామాపురం, సుబ్బానాయుడుకండ్రిగ, వేడం, చుక్కలనిడిగల్లు, తొట్టంబేడు మండల పరిధిలోని విరూపాక్షపురం, బసవయ్యపాళెం, కన్నలి తదితర గ్రామాల నుంచి నిత్యం ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. స్థానిక ఎమ్మెల్యే అండదండలు పుష్కలంగా ఉండడంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు.

మానని గాయం..ఆగని తవ్వకం!

2021, డిసెంబర్, 19న జీపాళెం దళితవాడకు చెందిన కాకి నాగరాజు కుమారుడు ధోని(16), కాకి వెంకటసుబ్బయ్య అలియాస్ సుబ్బారావు కుమారుడు యుగంధర్(14), పీ.జయశంకర్ కుమారుడు గణేష్(15), లోకేష్ కుమారుడు లిఖిత్ సాయి(14)లో కలసి ఫ్రిడ్జ్‌కి వచ్చే థర్మాకోల్‌ను తీసుకుని గ్రామ శివారున ఉన్న స్వర్ణముఖి నదిలోకి వెళ్లారు. బెండులపై ఇద్దరు చొప్పున కూర్చొని వాగులోకి వెళ్లారు. నది మధ్యలోకి వెళ్లడంతో ప్రమాదవశాత్తు బెండ్లు తిరగబడ్డాయి. ధోని, యుగంధర్, గణేష్ నీటిలో మునిగిపోయారు. సమీపంలో చేపలు పడుతున్న లక్ష్మమ్మ అనే మహిళ లిఖిత్‌సాయిని కాపాడారు. నాలుగేళ్లు గడుస్తున్నా.. ఆ ఊర్లోని వారు ఆరిన దీపాలను తలచుకుంటూ కన్నీటి చుక్క జారవిడుచుకుని రోజులు గడుపుతున్నారు. అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బాధితులకు బాసటగా నిలిచారు. ఇసుక ఎత్తనివ్వకుండా అధికారులకు ఆదేశాలిచ్చారు. అయితే కూటమి అధికారంలోకి రావడంతో నియోజకవర్గంలో విచ్చలవిడిగా ఇసుకను జేసీబీలు పెట్టి మరీ ఇసుక తవ్వేస్తున్నారు. ట్రాక్టర్లు, లారీలలో నింపుకుని తిరుపతి, చెన్నై, బెంగళూరుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.



మృతుల బంధువుల ఆర్తనాదాలు (ఫైల్)

ఇంకెంత మంది ప్రాణాలు పోవాలి?



నాలుగేళ్ల కట్టుగా ఇసుక రేణువు ఎత్తనివ్వకుండా నిలువరించాం. ఇప్పుడు కట్టు తప్పింది. గత 20 రోజులుగా జీపాళెం సమీపంలో ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తు న్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకునే దిక్కు లేదు. మీ ధనదాహానికి ఇంకెన్ని ప్రాణాలు మట్టిలో కలవాలి..?.

– మునికృష్ణారెడ్డి, జీపాళెం

ట్రాక్టర్ ఇసుక రూ.1,400

రేణిగుంట మండలం, జీపాళెం సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఇసుకను శ్రీకాళహస్తికి చెందిన ఓ టీడీపీ నాయకుడు, రేణిగుంటకు చెందిన ఇద్దరు ముఖ్యనాయకులు కలిసి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ పెద్దపెద్ద గోతులు తవ్వేశారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.1,400 కట్టితే మనుషులతో, చీకటి పడితే జేసీబీల సాయంతో లోడ్ చేస్తారు. ఎక్కడికి తోలుకున్నా ఆపేవారుండరు. దీంతో తెల్లవారకముందు నుంచి అర్ధరాత్రి వరకు ట్రాక్టర్లు, లారీలు క్యూకడుతున్నాయి. రోజుకు రూ.2 లక్షలకు పైగా వసూలు చేసి వాటాలు పంచుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు గానీ, మైనింగ్ అధికారులు గానీ అటువైపు కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు. దీంతో గ్రామస్తులు అడ్డుకుంటే భౌతికదాడి చేస్తారేమోనని భయాందోళన చెందుతున్నారు.



జీపాళెంలో ఇసుక ట్రాక్టర్ల జాతర

కన్నీటి సుడులే



మూడేళ్ల కిందట నా బిడ్డ గణేష్‌ను స్వర్ణముఖీ నది తనలో కలిపేసుకుంది. మాకు పుత్రశోకాన్ని మిగిల్చింది. మా ఆశలకు ప్రతిరూపమైన కన్న పేగును పోగొట్టుకుని మేము పడుతున్న వేదన పగవారికి కూడా రాకూడదు. నదిలో ఇసుక తవ్వేయడం వల్ల ఏర్పడిన గుంతల్లో కూరుకుపోయి మా గ్రామానికి చెందిన ముగ్గురు బిడ్డలు చనిపోయారు. వాళ్ల ప్రాణాలు విడిచిన చోటే మళ్లీ ఇసుక లోడుతున్నారు. ఇంకెంత మంది ప్రాణాలు పోవాలో తెలియడంలేదు. దీనికి అంతం లేదా?. – మృతుడు గణేష్ తల్లి జయలక్ష్మి, జీపాళెం దళితవాడ

ముక్క ముట్టాలంటే భయం!

కలవరపెడుతున్న బర్డ్ ఫ్లూ

- ఆందోళనలో మాంసం ప్రియులు
- పడిపోతున్న చికెన్ విక్రయాలు
- ఎలాంటి భయమొద్దంటున్న అధికారులు



తిరుపతి తుడా: ముక్క ముట్టాలంటే జిల్లా వాసులు భయపడిపోతున్నారు. ఇటీవల ఉభయ గోదావరి జిల్లాలో సంభవించిన కోళ్ల మరణాలకు కారణం బర్డ్ ఫ్లూగా నిర్ధారణ కావడంతో ఒకింత కలవరపాటుకు గురవుతున్నారు. ముక్క ముట్టేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో చికెన్ విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. చికెన్ షాపులు వెలవెలబోతున్నాయి.



తిరుపతిలో వెలవెలబోతున్న చికెన్ షాపు

పడిపోయిన చికెన్ విక్రయాలు

జిల్లాలో లేయర్ 45 లక్షలు, బ్రాయిలర్ 53.25 లక్షలు, లింగాపురం 1.10 లక్షల కోళ్ల ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో 60 శాతం మేర జిల్లాకు సరఫరా అవుతున్నాయి. అయితే గత రెండు రోజుల నుంచి చికెన్ విక్రయాలు 50 శాతానికి పైగా పడిపోయాయి. తిరుపతి లీలామహల్ కూడలిలోని ఓ చికెన్ దుకాణంలో రోజుకు 200 కిలోల చికెన్ విక్రయించేవారు. అయితే రెండు రోజులుగా 100 కిలోలు కూడా అమ్ముడుపోవడం లేదని దుకాణదారుడు వాపోయాడు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో కోడి రూ.50 లెక్కన, మరికొన్ని ప్రాంతాల్లో కిలో రూ.140కే విక్రయిస్తున్నారు.

జిల్లాలో నెల క్రితం చికెన్ ధరలు

బ్రాయిలర్ కిలో	రూ.260
లింగాపురం	రూ.280
ట్రే గుడ్లు	రూ.185

మంగళవారం ధరలు

బ్రాయిలర్ కిలో	రూ. 170
లింగాపురం	రూ. 230
ట్రే గుడ్లు	రూ. 170

అమ్మకాలు తగ్గాయి



గడిచిన మూడు రోజులుగా చికెన్ అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. మంగళవారం రోజున మరింతగా విక్రయాలు తగ్గడం వాస్తవమే. బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ కొనేందుకు ఆసక్తి చూపడం లేదు. రెండు రోజులుగా చికెన్ దుకాణాలు వేలవేలబోతున్నాయి. ఈ వైరస్ ఎఫెక్ట్ మనకు లేకపోయినా భయంతో ఎవరూ ముందుకు రావడం లేదు.

– కృష్ణమూర్తి, గోవర్ధన్ చికెన్ సెంటర్ నిర్వాహకులు, తిరుపతి

ఎలాంటి భయాందోళన వద్దు



బర్డ్ ఫ్లూ వైరస్ మన ప్రాంతంలో ఎక్కడా లేదు. ఈ వైరస్ పట్ల ప్రస్తుతం ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన పని లేదు. పశు సంవర్ధక శాఖ ఇప్పటికే దీనిపై పలు ఆదేశాలు జారీచేసింది. వలస పక్షుల కారణంగా ఈ వైరస్ వ్యాప్తికి కారణమైందని నిర్ధారించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఉభయ గోదావరి జిల్లాలో దీని ప్రభావం ఉంది. రాష్ట్రంలో మరెక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవు. ఈ వైరస్ గురించి ఆలోచన చేయడం అనవసరం. చికెన్ బాగా ఉడకబెట్టి తినడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– డాక్టర్ నాగేంద్ర రెడ్డి , వెటర్నరీ ఆఫీసర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్

గ్రీవెన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వండి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: అన్ని విభాగాలకు చెందిన అధికారులు గ్రీవెన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల, డివిజన్ స్థాయిలో ప్రతి సోమవారం గ్రీవెన్స్ చేపట్టాలని చెప్పారు. సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రీవెన్స్ నిర్వహించని వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు జిల్లా అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్, డీపీఓ సుశీలాదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన బాబు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ వై.సుమతి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వసంత బాయి, ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.

సహనానికి పరీక్ష

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. ఎక్కడో ఒకరిద్దరు అనర్హుల ఏరివేతకు అందరికీ పరీక్ష పెడుతోంది. సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన పేరుతో విభిన్న ప్రతిభావంతులను వేధింపులకు గురిచేస్తోంది. ఇందులో భాగంగానే మంగళవారం 90 శాతం వైకల్యం ఉన్నవాళ్లు కూడా కచ్చితంగా రావాల్సిందేనని హుకుం జారీ చేసింది. చేసేది లేక, ఎక్కడ పింఛన్ పోతుందోనన్న ఆందోళనతో తిరుపతి రుయా ఆస్పత్రికి క్యూ కట్టారు. సుదూర ప్రాంతాల నుంచి ఆపసోపాలు పడుతూ కుటుంబ సభ్యులు దివ్యాంగులను వెంటబెట్టుకొచ్చారు. వీరు పడుతున్న బాధలు చూసి పలువురు 'అయ్యో.. ఈ పాపం.' అంటూ ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెట్టడం కనిపించింది. – తిరుపతి తుడా



90 శాతం వైకల్యం ఉన్నా మళ్లీ వైద్య పరీక్షలకు తండ్రితో హాజరైన రామ్‌చరణ్



90 శాతం వైకల్యం ఉన్నా మళ్లీ పరీక్షలకు హాజరైన కొర్లగుంటకు చెందిన నాగరాజు



సదరం రీవెరిఫికేషన్‌లో భాగంగా పడిగాపులు కాస్తున్న బాధితులు



95 శాతం మానసిక సమస్యతో బాధపడుతున్న తన బిడ్డను రుయాకు తీసుకొచ్చిన దామినేడుకు చెందిన తల్లి మహాముని



మానసిక రోగి సమీరాను పరీక్షల నిమిత్తం తిరుపతి రుయాకు తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

టీటీడీకి రెండు ద్విచక్ర వాహనాల బహూకరణ



ద్విచక్ర వాహనాలను అందిస్తున్న దాతలు

తిరుమల: తిరుమల శ్రీవారికి మంగళవారం చెన్నైకి చెందిన టీవీఎస్, బెంగళూరుకు చెందిన ఎన్‌డీఎస్ ఎకో సంస్థల ప్రతినిధులు విద్యుత్ ద్విచక్ర వాహనాలను విరాళంగా అందించారు. టీవీఎస్ ఐ క్యూబ్ ఎక్స్ వాహనం ధర రూ.2.7 లక్షలు, ఎన్ డీఎస్ ఎకో వాహనం ధర రూ.1.56 లక్షలు అని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ముందుగా ఆలయం వద్ద ఆయా వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనాల తాళాలను టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరికి ఆయా సంస్థల ప్రతినిధులు అందజేశారు. టీవీఎస్ చైర్మన్ వేణుశ్రీనివాసన్, ఎండీ సుదర్శన్, తిరుమల డీఐ సుబ్రమణ్యం, ఎన్ డీఎస్ ఎకో సంస్థ చైర్మన్ ఎంహెచ్.రెడ్డి పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

చంద్రగిరి: ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి మరోకారు ఢీకొనడంతో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఐతేపల్లి వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పీఏ చంద్ర తన కారులో వ్యక్తిగత పనులు ముగించుకుని మంగళవారం గూడూరుకు తిరుగు ప్రయాణమయ్యాడు. ఐతేపల్లి వద్ద వస్తున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన స్విఫ్ట్ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రతో పాటు మరో కారులో ఉన్న సీత్‌రాజ్ స్వల్పంగా గాయపడ్డారు. అనంతరం క్షతగాత్రులు మరొక వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు. తెల్లవారుజామున పొగమంచు కారణంగానే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ సైన్స్ మహిళా దినోత్సవం



ఐజర్‌లో మహిళా ప్రొఫెసర్లు

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం, జంగాలపల్లి సమీపంలోని తిరుపతి ఐజర్‌లో మంగళవారం రాత్రి అంతర్జాతీయ సైన్స్ మహిళా, బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్లోబల్ ఉమెన్ బ్రేక్‌ఫాస్ట్–2025 పేరుతో లింగసమానత్వం సాధనపై మహిళా ప్రొఫెసర్లు, విద్యార్థినులు చర్చాగోష్టి నిర్వహించారు.

అన్నదాతకు హైటెన్షన్!

- రైతు గుర్తింపు కార్డులకు ఈనెల 25 వరకు గడువు
- ముందుగా పీఎం కిసాన్ పొందే వారికి ప్రాధాన్యం
- గుర్తింపు కార్డు ఉంటేనే బ్యాంక్ రుణాలు, ప్రభుత్వ పథకాలు



వరదయ్యపాళెం మండలం, మరదవాడ గ్రామంలోని రైతు భరోసా కేంద్రం

తిరుపతి అర్బన్: అన్నదాతలను కూటమి ప్రభుత్వం టెన్షన్‌లో పెడుతోంది. ప్రతి రైతూ గుర్తింపు కార్డు తీసుకోవాలంటూ కొత్త మెలిక పెట్టింది. కార్డు పొందడానికి ఈనెల 25వ తేదీ వరకు మాత్రమే గడువు విధించింది. రైతు సేవా కేంద్రాల్లో (రైతు భరోసా కేంద్రాలు)ఏపీ రిజిస్ట్రీ పోర్టల్లో మాత్రమే చేయించుకోవాలని సూచించింది. ముందుగా పీఎం కిసాన్ పథకం పొందుతున్న రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని వెల్లడించింది. తర్వాత సొంత భూములున్న అందరి రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్టు పేర్కొంది. అయితే కౌలు రైతుల మాట ఎక్కడా ప్రస్తావించకపోవడం విమర్శలకు తావిస్తోంది. రైతు గుర్తింపు కార్డు ఉంటేనే బ్యాంక్ రుణాలు, సబ్సిడీ ఇవ్వాలన్నా.. ప్రభుత్వ పథకాలు పొందాలన్నా.. గుర్తింపు కార్డులే ప్రామాణికంగా చెబుతున్నారు. దీంతో రైతులు ఆందోళనలో మునిగిపోయారు. బుధవారం నుంచి రైతు సేవా కేంద్రాల్లో రైతులు బారులు తీరాల్సి ఉంది.

రైతులు బిజీబిజీ

వరి ఒబ్బిళ్లు ఫిబ్రవరి 1 నుంచి జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. మే 31 వరకు ఈ ఒబ్బిళ్లు ఉంటాయి. దీంతో రైతులు ఉదయం నుంచి రాత్రి వరకు పొల్లాలోనే బిజీగా గడుపుతున్నారు. ఇలాంటి తరుణంలో కూటమి ప్రభుత్వం రైతు గుర్తింపు కార్డులకు 13 రోజులు గడువు అందించడంపై సర్వత్రా గందరగోళం నెలకొంది.

కార్డులేకుంటే గోవిందా?

రైతు గుర్తింపు కార్డు ద్వారా సకల సౌకర్యాలు కలగనున్నాయి. ఇందులో ప్రభుత్వ సబ్సిడీలు, పంట బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ పథకం, తుపాన్లతో పాటు ప్రకృతి వైపరీత్యాల్లో పంట నష్టానికి పరిహారం తదితరాలు అందనున్నాయి. కార్డు లేకుంటే ఇవన్నీ ఆగిపోనున్నాయి.

11 అంకెలతో గుర్తింపు కార్డు



రైతులకు 11 అంకెలతో ప్రత్యేక గుర్తింపు కార్డు అందించనున్నాం. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలన్న సంకల్పంతో కేంద్రం ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 25వ తేదీ లోపు అందరూ రైతు సేవా కేంద్రాల్లో గుర్తింపు కార్డును పొందాలి.

–ఎస్.వెంకటేశ్వర్, జిల్లా కలెక్టర్

రైతులందరికీ కార్డులు



భూములున్న రైతులు అందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 11 అంకెలతో ఉన్న గుర్తింపు కార్డును గుర్తుపెట్టుకోవాల్సి ఉంటుంది. ఈ సంఖ్య ఉన్నవారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయి. –ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఇది సరికాదు



కూటమి సర్కార్ ఇప్పటి వరకు రైతులకు ఏమీ చేయలేదు. అన్నదాత సుఖీభవ మాటేలేదు. అయితే ఏదో ఒక హడావుడి మాత్రం చేస్తున్నారు. జిల్లాలో 2 లక్షల మంది రైతులు ఉన్నారు. రబీ సీజన్ నేపథ్యంలో అంతా జోరుగా పొలం పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ క్రమంలో రెండు వారాలు మాత్రమే గడువు ఇవ్వడం ఏ మాత్రం సరికాదు. 25 లోపు రైతు సేవా కేంద్రాల్లో మాత్రమే చేయించుకోవాలని చెబితే...రైతులు అంతా క్యూ కట్టాల్సి ఉంది. లేదంటే నెట్‌సెంటర్లు, మీ సేవా కేంద్రాలకు తదితర అన్నింటికి ఇస్తే రైతులకు ఇబ్బందులు ఉండవు. –మల్లికార్జున్‌రెడ్డి, సిద్ధాపురం గ్రామం రైతు, వరదయ్యపాళెం మండలం

జేఈఈ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



అభిరామ్ ఓ.మోక్షిత్ శర్మ జీవన్ కుమార్ నిఖిల్ ప్రీతమ్ చౌదరి వెంకట్ వరుణ్‌తేజ్ గంగా మనోజ్ కుమార్

తిరుపతి ఎడ్యుకేషన్: ఎన్‌టీఏ గత నెల 21వతేదీ నుంచి నిర్వహించిన జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, టాప్ పర్సంటైల్ సాధించారని కళాశాల ఏజీఎమ్ బీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో అభిరామ్, ఓ.మోక్షిత్ శర్మ 99.8 పర్సెంటైల్ సాధించగా, జీవన్ కుమార్ 99.2, నిఖిల్ 99.0, మంజునాథ్ 98.7, ప్రీతమ్ చౌదరి 98.6, సి.వెంకట్ వరుణ్‌తేజ్ 98.2, గంగా మనోజ్ కుమార్ 98.2 పర్సెంటైల్ సాధించి విజయదుదుంబి మోగించారని హర్షం వ్యక్తంచేశారు. అధ్యాపకుల కృషి, కళాశాల పటిష్ట ప్రణాళికతోనే విద్యార్థులు విజయం సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అధ్యాపకులు, యాజమాన్యం అభినందించారు.

ట్రైనీ ఐపీఎస్ అధికారి బాధ్యతల స్వీకరణ



తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ ఐపీఎస్ అధికారి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో శిక్షణ నిమిత్తం ట్రైనీ ఐపీఎస్ అధికారి బీ.హేమంత్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం నుంచి ఆయన నెల రోజుల పాటు పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ ఎఫ్ఐఆర్ నమోదు నుంచి కేసుల దర్యాప్తు వరకు వివిధ అంశాలపై పూర్తి స్థాయిలో శిక్షణ తీసుకోనున్నారు. ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్‌కు చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐ చిన్నగోవిందు, ఎస్ఐలు రామకృష్ణ, ఎస్‌కె.మూర్తి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందిని పరిచయం చేశారు. అంతకుముందు ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్ తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలసి రిపోర్ట్ చేసుకున్నారు.

రైల్వే గ్యాంగ్‌మన్ మృతి

– మరొకరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన అభిషేక్(ఫైల్)

తడ: రైల్వే ట్రాక్‌పై గ్యాంగ్ మన్‌లు పనిచేస్తున్న సమయంలో అకస్మాత్తుగా రైలు రావడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రైల్వే సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. తడ మండల పరిధిలోని అనపగుంట రైల్వే గేటు సమీపంలో చెన్నై వైపు వెళ్లే మార్గంలో మంగళవారం ఇద్దరు గ్యాంగ్ మన్‌లు పనిచేస్తున్నారు. అదే సమయంలో అకస్మాత్తుగా రెండు ట్రాకులపై ఒకేసారి రైళ్లు రావడంతో ప్రమాదం చోటుచేసుకుంది. పనిలో నిమగ్నమైన సిబ్బందికి వెనుక వస్తున్న రైలు శబ్దం వినిపించలేదు. రైలు దగ్గరగా వచ్చిన సమయంలో వెనుక నుంచి చెన్నై వైపు వెళ్లే టాటానగర్ – ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలు కూత వినిపించడంతో తప్పించుకునే ప్రయత్నం చేశారు. రైలు దగ్గరకు వచ్చేయడంతోపాటు పక్క ట్రాక్‌లో మరో ట్రైన్ వెళుతుండడంతో ఎటు వెళ్లాలో తెలియని స్థితి నెలకొంది. దీంతో ట్రాక్ మెయింటైనర్‌గా పనిచేస్తున్న కేరళకు చెందిన ఏఆర్ అభిషేక్(30) పట్టాలపై పరుగులు తీశాడు. వేగంగా వస్తున్న రైలును తప్పించుకోలేకపోవడంతో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అతనితోపాటు గ్యాంగ్ మేస్త్రీగా పనిచేస్తున్న బిహార్‌కి చెందిన మంజయ్ కుమార్(33) ఎడమ వైపుకు ఎగిరి దూకగా అతని కాలుకు రైలు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ మంజయ్‌ని 108 సిబ్బంది ఈఎంటీ శుభకర్, పైలెట్ దేవా ప్రథమ చికిత్స చేసి సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తీసుకెళ్లారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన దినకర్



వివరాలు నమోదు చేసుకుంటున్న పోలీసులు

బాలాయపల్లి(సైదాపురం): విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందిన ఘటన బాలాయపల్లి మండలం, నిండలి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. నిండలి గ్రామానికి చెందిన దినకర్ (30) గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్‌గా విధులు నిర్వహించేవాడు. ప్రస్తుతం ఆ గ్రామ సమీపంలో వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని, గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పంటకు సాగురు పెట్టేందుకు అదే గ్రామానికి చెందిన పెంచలయ్యతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. మోటారు వద్ద వైర్లు తగిలి దిలీప్ షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాడు. బాలాయపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదు.

అక్రమాలకు పాల్పడితే సహించం

- 17వ సామాజిక తనిఖీ బహిరంగ సభలో డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్



మాట్లాడుతున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

రేణిగుంట(ఏర్పేడు): ఉపాధిహామీ పనులలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సహించబోమని జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ హెచ్చరించారు. ఏర్పేడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ బృందం చేపట్టిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. మండలంలో చేపట్టిన రూ.9,49,60,964 పనులపై సామాజిక తనిఖీ చేశారు. ఈ పనుల్లో రూ.1,19,500 విలువైన అవకతవకలను గుర్తించి ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానాలు విధించారు. రూ.1,27,173 రికవరీ చేశారు. ఒకరి జాబ్ కార్డు మీద మరొక కూలీని పని చేయించినందుకు గాను మండలంలోని పంగూరు ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి, పల్లం ఫీల్డ్ అసిస్టెంట్ సుమలతను విధుల నుంచి తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌభాగ్యం, ఏపీఓ దేవరి తదితరులు పాల్గొన్నారు.

నేరాల కట్టడే లక్ష్యం

తిరుపతి క్రైమ్: జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను పెంచి నేర నియంత్రణ కట్టడి చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను పెంచి, గత వారం రోజుల్లో సాధించిన పురోగతి వివరాలను మంగళవారం వెల్లడించారు. రాత్రిపూట రోడ్లపై తిరుగుతున్న 165 మంది అనుమానిత వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్టు వెల్లడించారు. అలాగే అక్రమంగా తరలిస్తున్న గంజాయి సుమారు 41.5 కిలోలను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. బహిరంగంగా మద్యం సేవించే వారిపై 913 కేసులు నమోదు చేసి 913 మందికి కోర్టులో జరిమానాలు పడేలా చర్యలు చేపట్టామన్నారు.

ఈ–శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోండి

తిరుపతి అర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి ప్రతి అసంఘటిత కార్మికుడు తన వివరాలను ఈ -శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఈ – శ్రమ్ పోర్టల్ పై సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు ఈ– శ్రమ పోర్టల్‌లో వారి పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా వారికి సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. కార్మికులతోపాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఈ ప్రక్రియకు వయసు పరిమితి 16–59 సంవత్సరాల వరకు ఉందన్నారు. ఆదాయపు పన్ను చెల్లించని వారు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం లేని వారు, నెలకు రూ.15 వేల లోపు జీతం తీసుకునేవారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. ఈ పథకంలో చేరిన వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా, అంగవైకల్యం అయితే రూ.లక్ష వరకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు.

హిందూ ధర్మాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న అదనపు ఈఓ వెంకయ్యచౌదరి

తిరుమల: టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా నేర్చుకున్న ప్రతి విషయాన్ని భక్తుల్లోకి తీసుకెళ్లాలని టీటీడీ అదనపు ఈఓ వెంకయ్యచౌదరి సూచించారు. తిరుమలలో బుధవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవ కార్యక్రమం ఆస్థాన మండపంలో మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అదనపు ఈఓ భక్తులనుద్దేశించి ప్రసంగించారు. 1979లో టీటీడీ ప్రారంభించిన దాస సాహిత్య ప్రాజెక్టు సంకల్పం పరిపూర్ణమై ప్రజల్లోకి వెళ్లిందని చెప్పారు. దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ ఒక్కసారి మెట్లోత్సవంలో పాల్గొంటే 108 సార్లు స్వామివారిని దర్శించుకున్న పుణ్యఫలం దక్కుతుందన్నారు. ప్రవచనకర్త హయగ్రీవాచార్యులు, ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటకకు చెందిన భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.



హాజరైన భజన మండలి సభ్యులు

సమ్మెకాలపు ఒప్పందాల సాధనకు సన్నద్ధం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు

తిరుపతి కల్చరల్: అంగన్‌వాడీ కార్మికుల సమ్మెకాలపు ఒప్పందాల సాధనకు కార్మికులంతా సన్నద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర సమితి విస్తృత సమావేశం మంగళవారం తిరుపతిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో 42 రోజులు సమ్మె ఉద్యమాల ఫలితంగా ఒప్పందం చేసుకున్న అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి నేతలు వేతనాలు సకాలంలో చెల్లిస్తామని, పెరిగిన వేతనాలు ఇప్పిస్తామని హామీలు గుప్పించారని తెలిపారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా సమ్మె కాలం ఒప్పందాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో అంగన్‌వాడీ ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు ఎస్.మంజుల, ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, నగర కార్యదర్శి ఎన్‌డీ.రవి పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించే వరకు సమ్మె



9వరోజు సమ్మెలో పాల్గొన్న వెటర్నరీ వైద్య విద్యార్థులు

తిరుపతి సిటీ: తమ న్యాయపరమైన సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం దారుణమని, సమస్య పరిష్కారమయ్యేవరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని వెటర్నరీ జూడాలు తేల్చిచెప్పారు. మంగళవారం వర్సిటీలో వెటర్నరీ వైద్యులు చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా గౌరవ వేతనం పెంచాలని రోడ్డున పడి గొంతెండిపోయేలా అరుస్తున్నా అధికారులలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మిగిలిన వైద్య విభాగాల్లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులకు అందించే గౌరవ వేతనాన్ని తమకు కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమానికి పాటు పడుతున్న వెటర్నరీ జూడాలకు ప్రభుత్వం తక్షణం గౌరవ వేతనాన్ని పెంచి ఆదుకోవాలని కోరారు. కేవలం రూ.10 వేలు చెల్లిస్తామని పుకార్లు పుట్టిస్తున్నారని, అందుకు తాము అంగీకరించమని చెప్పారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న చిట్టిబాబు

నాగలాపురం: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన పిచ్చాటూరు మండలం, ముడియూరు పంచాయతీ, లక్ష్మి విలాసపురం గ్రామంలో విషాదం నింపింది. గ్రామానికి చెందిన వై.చిట్టిబాబు (50) తుపాను కారణంగా వరుసగా పంటలు వేసి నష్టపోయాడు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తలకు మించిన భారం కావడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం తన పొలంలో పురుగుల మందు సేవించి స్పృహతప్పి పడిపోయాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చిట్టిబాబు పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యాధికారి తిరుపతి రుయా ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. చిట్టిబాబుకు సుమారు రూ.5 లక్షల వరకు అప్పు ఉందని గ్రామస్తులు తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు.